సాక్షి మహబూబాబాద్

శుక్రవారం | 13 | డిసెంబర్ | 2024



ఇంటి వద్దనే జీవనధ్రువీకరణ పత్రం!

విశ్రాంత ఉద్యోగుల ఇళ్ల వద్దకు తపాలా సిబ్బంది వెళ్లి డిజిటల్ జీవన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. - 8లో▸



వేసవిలో వినియోగదారులకు ఇబ్బందులు కలగొద్దు

వేసవిలో విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ సూచించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

$34.5^0/13.1^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

వణుకుతున్న విద్యార్థులు

- రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత
- సంక్షేమ హాస్టళ్లలో దుప్పట్లు కరువు
- రెక్కలు లేని కిటికీలు, తలుపులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. దీంతో సాయంత్రం నుంచే చలి గాలులు వీస్తున్నాయి. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మంచు కురుస్తోంది. ఇళ్లలోని ప్రజలు వెచ్చని దుస్తులు, రగ్గులు, చెద్దర్లు కప్పుకొని చలినుంచి రక్షణ పొందుతున్నారు. అయితే సంక్షేమ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు మాత్రం దుప్పట్లు లేక చలికి వణుకుతున్నారు.

కిటికీలకు రెక్కలు కరువు..

సంక్షేమ హాస్టళ్ల గదులకు సరిగా తలుపులు లేవు. అలాగే కిటికీలకు రెక్కలు లేకపోవడంతో నేరుగా చలి గదుల్లోకి చేరుతుండంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి సరైన దుప్పట్లు లేక చలికి వణికిపోతున్నారు. ఉన్న కొద్ది దుప్పట్లతోనే విద్యార్థులు సర్దుకుపోతున్నారు. మండల కేంద్రాల్లోని హాస్టళ్ల పరిస్థితి మరి అధ్వానంగా ఉందని, నిద్రలు లేని రాత్రులు గడుపుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. చలికి తోడు దోమలు స్వైర విహారం చేస్తుండడంతో విద్యార్థులకు కంటిమీద కునుకు ఉండడం లేదు.

చన్నీళ్ల స్నానం..

చలికి తోడు చన్నీళ్ల స్నానాలతో విద్యార్థులు వణికిపోతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలు, కేజీబీవీలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు వేడి నీళ్లు లేకపోవడంతో చన్నీటి స్నానం చేయాలంటే వణుకుతున్నారు.

నిధులు మంజూరు..

జిల్లాలోని ఎస్సీ, బీసీ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం కిటికీలు, తలుపుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. కానీ నేటికీ ఈ నిధులతో మరమ్మతులు మాత్రం చేయించలేదు. విద్యార్థులు తమ బాధలను చెప్పుకుందామన్నా పలువురు వార్డెన్‌లు స్థానికంగా అందుబాటులో ఉండడం లేదు.



ఎస్టీ హాస్టల్‌లో ఒకే చెద్దరును కప్పుకుని నిద్రిస్తున్న ఇద్దరు విద్యార్థులు

జిల్లాలో వసతి గృహాల వివరాలు

	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ హాస్టల్స్	19	2,000
ఎస్టీ హాస్టల్స్	34	8,861
బీసీ హాస్టల్స్	14	1,300
బీసీ గురుకులాలు	6	2,960
ఎస్సీ గురుకులాలు	6	3,440
ఎస్టీ గురుకులాలు	16	6,059
మైనార్టీ గురుకులాలు	6	1,511
కేజీబీవీలు	16	3,315
మోడల్ స్కూల్ వసతి గృహాలు	8	409

స్థానికంగా ఉండని వార్డెన్లు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వార్డెన్లు వసతి గృహాల్లోనే రాత్రి బస చేయాలి. కానీ పలు హాస్టళ్ల వార్డెన్లు రాత్రి వేళల్లో బస చేయకుండా సమీపంలోని పట్టణ కేంద్రాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల మానుకోట జిల్లా కేంద్రంలోని హస్తినాపురం ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో రాత్రి వేళ దొంగలు పడి విద్యార్థుల ఫోన్‌లు, దుప్పట్లు, దుస్తులు, డబ్బులు ఎత్తుకెళ్లారు. ఈమేరకు విద్యార్థులు మానుకోట టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరికొంత మంది విద్యార్థులు హాస్టళ్లలో రాత్రి వేల మద్యం, సిగరేట్లు తాగుతున్నారు. బయటి నుంచి ఎవరు ఎప్పుడు ఎలా వస్తున్నారో విద్యార్థులకు అర్థం కావడం లేదు. దీంతో చాలామంది విద్యార్థులు చెడు వ్యసనాలు, మత్తుకు బానిసలవుతున్నారని తోటి విద్యార్థులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, సంక్షేమ హాస్టళ్ల జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రగ్గులు అందించాలి



నేను హాస్టల్‌కు వచ్చిన కొత్తలో రగ్గులు అందించారు. మళ్లీ ఇంత వరకు హాస్టళ్లలో రగ్గులు అందించలేదు. చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. నా దుప్పటి నేను నా స్నేహితుడు కప్పుకుంటున్నాం.

- బి.తిరుపతి, బీసీ హాస్టల్ విద్యార్థి, మానుకోట

వేడి నీటిని అందించాలి



చలి తీవ్రత పెరుగుతుంది. మా హాస్టల్‌లో దుప్పట్లు అందించారు. కానీ అవి చాలా పతులగా ఉన్నాయి. చలికి తట్టుకోలేక పోతున్నాం. ఉదయం వేడి నీటిని స్నానానికి అందించాలి.

-ఎల్.విజయ్, ఎస్టీ హాస్టల్ విద్యార్థి, మానుకోట

రాజీ మార్గమే రాజమార్గం

- 14న జాతీయ మెగా లోక్ అదాలత్
- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: రాజీ మార్గమే రాజమార్గమని, ఈ నెల 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ మాట్లాడుతూ.. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్నచిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జ్యుడీషియల్ శాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీసు సిబ్బంది రాజీపడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, రాజీపడేటట్లు అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.



ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

గ్రూప్-2 పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- 21 పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థుల హాజరు
- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: జిల్లా పరిధిలో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే గ్రూప్-2పరీక్షలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ (144) సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులు గుంపులుగా ఉండొద్దని, ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాల్లో ఇంటర్‌నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ పాలక మండలి సభ్యులు శుక్రవారం ప్రమాణస్వీకారం చేస్తారని ఈఓ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటైన పాలక మండలిని యథావిధిగా కొనసాగిస్తు ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. నేడు ప్రమాణస్వీకారోత్సవం జరుగుతుందని, భక్తులు హాజరుకావాలని తెలిపారు. చైర్మన్‌గా కొర్ను రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలుగా బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, కుదురుపాక ఉప్పలయ్య, బందెల సంజీవరెడ్డి, దొంగలి జనార్దన్‌రెడ్డి, ధరావత్ రజిత, గడీల భిక్షపతి, ప్రొద్దుటూరి సత్యనారాయణ, భూక్య శక్రు, గుగులోత్ సోమ్లా, వెంపటి శ్రీను, టి.వెంకటేశం గౌడ్, కాసుల మల్లికార్జున్, రెడ్యాల శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు.

న్యూస్‌రీల్

ఎరువుల దుకాణాల తనిఖీ



కేసముద్రం: మండల కేంద్రంలోని ఎరువులు పురుగు మందుల దుకాణాలు, ధన్నసరి సొసైటీ గోదాంను డీఏఓ విజయనిర్మల గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు రాజరాజేశ్వరి షాపులో ఎరువుల లైసెన్స్ , కంపెనీ ఓఫామ్ ఇన్‌క్లూడ్ చేయని కారణంగా 21టన్నుల యూరియా, 10.55 టన్నుల కాంప్లెక్స్ ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. షాపుల డీలర్లు స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, ఇన్వాయిస్‌లను మెయింటెన్ చేయాలన్నారు. ఈ-పాస్ మిషన్ బ్యాలెన్స్, గోదాం బ్యాలెన్స్, స్టాక్ రిజిస్టర్ బ్యాలెన్స్ సమానంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. నియమనిబంధనలు పాటించని డీలర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ వెంకన్న ఉన్నారు.

కేంద్ర గిరిజనశాఖ మంత్రిని కలిసిన హుస్సేన్‌నాయక్



మహబూబాబాద్ అర్బన్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరంను గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థుల వసతిగృహం కోసం రూ.20కోట్లు మంజూరు చేయాలని, గూడూరు భీమునిపాద జలపాతాన్ని పర్యాటకప్రాంతంగా రూపుదిద్దాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. పీహెచ్‌డీ ఉపకారవేతనాలకు దరకాస్తు చేసుకున్న విద్యార్థులకు లబ్ధి చేకూర్చాలని హుస్సేన్‌నాయక్ కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. అనంతరం మంత్రిని సన్మానించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలను విజయవంతం చేయాలి



మహబూబాబాద్ అర్బన్ : ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ సీనియర్ పోటీలను విజయవంతం చేయాలని బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ప్రభాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. ఈ క్రీడలు సమర్థవంతంగా నిర్వహించి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంజీవ, జిల్లా బాధ్యుడు పద్మావతి, పుష్పలీల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో కొండచిలువ సంచారం



చిన్నగూడూరు : పంట పొలాల్లో రైతుల చేతిలో ఏడడుగుల కొండచిలువ హతమైన సంఘటన మండలంలోని ఉగ్గంపల్లి శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సైదులు పంట పొలంలో కూలీలతో పని చేయిస్తున్నాడు. ఈ క్రమంలో సుమారు ఏడడుగుల పొడవు ఉన్న కొండ చిలువ కనిపించింది. దానిని చూసి పొలాల్లో పని చేస్తున్న కూలీలు భయంతో పరుగులు తీశారు. చుట్టు పక్కల రైతులు అక్కడికి చేరుకుని కర్రలతో వెంటపడి కొండ చిలువను హతమార్చారు. కొండచిలువను చంపేయడంతో చుట్టుపక్కల రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

కేయూ ఎంసీఏ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంసీఏ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 19 నుంచి నిర్వహించేందుకు పరీక్షల విభాగాధికారులు టైంటేబుల్ విడుదల చేశారు. గురువారం ఆయా విద్యార్థులు తమకు ఇతర పోటీ పరీక్షలున్నాయని వాయిదా వేయాలని పరీక్షల విభాగాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయా పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్యులు కె.రాజేందర్ తెలిపారు. మళ్లీ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తామనేది తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

పండుగ వాతావరణంలో నిర్వహించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం 40 శాతం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 14న జిల్లాలోని 125విద్యాసంస్థల్లో పండుగ వాతావరణంలో చార్జీల పెంపు కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహిస్తామని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు విద్యార్థులు ,వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రుచికరమైన భోజనం సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో పక్కా ప్రణాళికతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మాచారి, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీఈఓ రవీందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలి

గ్రూప్-2 పరీక్షలకు అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో గురువారం గ్రూప్-2 పరీక్షల నిర్వహణ, బయోమెట్రిక్ విధానంపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, డిపార్టుమెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 పరీక్ష ఉంటుందని, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందన్నారు. ఈనెల 16న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పేపర్-3, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పేపర్-4 పరీక్ష ఉంటుందని చెప్పారు. జిల్లాలో మొత్తం 7,470 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు 21మంది, డిపార్ట్‌మెంట్ అధికారులు 24 మంది, అబ్జర్వర్లు 23 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 10మంది, బయోమెట్రిక్ అధికారులు 55 మంది, ఐడెంటిఫికేషన్ అధికారులు 86 మంది పరీక్ష విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించవద్దన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలన్నారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేయాలన్నారు. అభ్యర్థులు ఎటువంటి ఆందోళనకు గురికావొద్దని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మాచారి, పరీక్షల ఆర్సీఓ బలరాంనాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మెరుగైన ఫలితాలే లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ
- శ్రద్ధతో ఉపాధ్యాయుల బోధన
- దాతల సహకారంతో స్నాక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ

కురవి: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పదో తరగతి విద్యార్థులపై జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ.. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు ఆకస్మిక తనిఖీలతో ఉపాధ్యాయులను అప్రమత్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలంటే ఉత్తీర్ణత శాతం పెంచడంతోపాటు అధిక సంఖ్యలో విద్యార్థులు 10జీపీఏ సాధించేలా ప్రత్యేక తరగతుల నిర్వహణ కోసం కష్టపడాలని ఆదేశిస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా..

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు ఉన్నతాధికారులు సూచించారు. దీంతో ఉత్తీర్ణత శాతం పెంచుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 101 హైస్కూల్స్, 15 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, 8 మోడల్ స్కూల్స్‌తోపాటు వివిధ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 8,276 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా జిల్లా విద్యాశాఖ పర్యవేక్షిస్తోంది.

ప్రత్యేక కార్యక్రమాలు...

పదో తరగతి విద్యార్థులను దత్తత తీసుకున్న ఉపాధ్యాయులు వారిని ఉదయం 5గంటలకు నిద్ర నుంచి లేపేందుకు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చదువుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. పాఠశాల సమయానికి గంట ముందు రావడం, స్కూల్ ముగిసిన గంట తర్వాత విద్యార్థులు ఇళ్లకు వెళ్లేలా చర్యలు తీసుకొని ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

దాతల సహకారంతో ముందుకు...

ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, స్నాక్స్ కోసం ఆయా గ్రామాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించి దాతలు స్పందించేలా చూస్తున్నారు. దాతల నుంచి సేకరించిన వాటిని విద్యార్థులకు అందిస్తున్నారు.

జనవరి, ఫిబ్రవరిలో గ్రాండ్ టెస్ట్‌లకు సిద్ధం..

వచ్చే జనవరి, ఫిబ్రవరి నెలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంచి, మంచి మార్కులు సాధించేలా జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో గ్రాండ్ టెస్టులను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో వందశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేస్తున్నారు.



ప్రత్యేక తరగతులను బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

10జీపీఏ సాధించేందుకు కష్టపడుతా



వార్షిక పరీక్షల్లో 10జీపీఏ సాధించేందుకు కష్టపడి చదువుకుంటున్నాను. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు చెబుతున్నారు. స్టడీ మెటీరియల్స్, స్నాక్స్ అందిస్తున్నారు. ఉపాధ్యాయులు మాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

-మలిశెట్టి సాహితి, టెన్త్ క్లాస్ విద్యార్థిని, కొత్తూరు, కురవి

వందశాతం ఫలితాల కోసం కృషి



పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. ప్రత్యేక తరగతులపై శ్రద్ధచూపుతున్నాం. మండల పరిధిలో అన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను పర్యవేక్షించి సలహాలు, సూచనలు ఇస్తున్నాం. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు వచ్చే రెండు నెలలు గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తాం.

-ఇస్లావత్ లచ్చిరాంనాయక్, సీరోలు ఎంఈఓ

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు రూరల్: ఆదర్శ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఎంటీఏ జిల్లా అధ్యక్షుడు పరుపాటి కిరణ్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని గుర్తూరు ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేయాలని, జీఓ 10 ప్రకారం వేతనాల చెల్లింపు, నోషనల్ సర్వీస్, ఇంక్రిమెంట్, హెల్త్ కార్డులు, కారుణ్య నియామకాలు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వప్న, నరసింహారావు, లింగయ్య, వెంకన్న, రాజు, బసవయ్య, కోటేశ్వరరావు, వెంకటేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్ : సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు పీఆర్టీయూ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. దీక్షలో భాగంగా గురువారం ఎస్ఎస్ఏ ఉద్యోగులు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 19,350మంది 20 సవంత్సరాలు విధులు నిర్వహిస్తున్నారని, సమగ్ర శిక్ష ఉద్యోగులను సాదుకుంటారో, సంపుకుంటారో, ఆదుకుంటారో అనేది ప్రభుత్వ ఇష్టమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల్లో హామీని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఖాదర్, ప్రభాకర్, గణేష్, అనిల్, భిక్షపతి, సరస్వతి, రాజేశ్వరి, సుధాకర్, సంపత్, బాష్‌సింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పులి దేవేందర్

పాలకమండలిని ఏర్పాటు చేయాలి




సమావేశంలో పాల్గొన్న నాయకులు

తొర్రూరు : ఏకలవ్య కార్పొరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేయాలని వైహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలో ఎరుకల హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం సాయిలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ తీర్మానంతో ఏకలవ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తున్నామని, వెంటనే పాలక మండలిని ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేషన్‌కు రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. ఎరుకల హక్కుల కోసం రెండున్నర దశాబ్దాలుగా పాటుపడుతున్న వైహెచ్‌పీఎస్ సంఘ నాయకత్వానికి కార్పొరేషన్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడిగడ్డ శ్రీనివాస్, సంపత్, సదానందం, వీరసోములు, సందీప్, మధు తదితరులు పాల్గొన్నారు.

16నుంచి ధనుర్మాసోత్సవాలు

గార్ల : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీవరకు ధనుర్మాసోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అర్చకుడు కాండూరి లక్ష్మీనారాయణాచార్యులు గురువారం తెలిపారు. దేశంలోనే లక్ష్మీనారాయణస్వామి దేవాలయాలు అరుదుగా ఉంటాయని, గార్లలో స్వామివారి ఆలయం ఉండటం విశేషమన్నారు. ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు వచ్చే 4 శుక్రవారాల్లో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, జనవరి 1న నూతన సంవత్సరం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామనారు. 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా గోదాదేవి అమ్మవారు భక్తులకు ఉత్తర ద్వారదర్శనం, 13న గోదారంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకుడు పేర్కొన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అర్చకులు కోరారు.



గోదాదేవి రంగనాథస్వామి ఉత్సవమూర్తులు

ప్రవేశాల గడువు పొడిగింపు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఈనెల 16 వరకు గడువు పొడిగించినట్లు.. ఇదే చివరి అవకాశం అని హనుమకొండ డీఈఓ వాసంతి, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ అనగోని సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ, జూనియర్ కళాశాలల్లోనూ సంప్రదించాలన్నారు. అధ్యయన కేంద్రాల్లో ధ్రువ పత్రాలు సమర్పించి అడ్మిషన్ ఫామ్ పొంది అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నమోదు చేయించుకోవాలని సూచించారు. అభ్యర్థులే స్వయంగా అడ్మిషన్ల ఫీజును డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్ స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫామ్ ప్రింటవుట్‌ను ఈనెల 17న సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ అనగోని సదానందం 93460 20003, 93963 37572 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

22న 'కాకతీ' కదన భేరి

● సీపీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జనగామ రూరల్‌: వరంగల్‌లో ఈ నెల 22న కాకతీ కదనభేరి నిర్వహించనున్నట్లు సీపీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం, చౌడారం మోడల్‌ స్కూల్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్‌ శ్రీకాంత్‌తో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ ఏప్రిల్‌ 01, 2025 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్‌ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ డిసెంబర్‌ 22న వరంగల్‌ జిల్లా కేంద్రంగా భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ సభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాల్వల శ్రీకాంత్‌, జిల్లా అధ్యక్షుడు కాకాని లక్ష్మణమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగమూర్తి, బుచ్చన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్‌ సెక్రెటరీ మల్లికార్జున్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్‌ కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

చిరుత కాదు.. నక్క జాతి జంతువు

● నిర్ధారించిన అటవీశాఖ అధికారులు



పాదముద్రలు చూస్తున్న అటవీ శాఖ సిబ్బంది

వాజేడు: మండలంలోని దూలాపురం రేంజ్‌ పరిధిలో ఉన్న గుమ్మడి దొడ్డి గ్రామ సమీపంలో రెండు, మూడు రోజుల క్రితం చిరుతపులి సంచరించినట్లు జరుగుతున్న ప్రచారానికి అటవీశాఖ అధికారులు పులిస్టాప్‌ పెట్టారు. దూలాపురం ఇన్‌చార్జ్‌ రేంజర్‌ బాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం పాదాల గుర్తులు ఉన్న ఎట్టి దేవదాసు చేనుతో పాటు బొగత జలపాతం వాగు వెమ్మ పరిశీలించారు. చిరుత పులి పాదముద్రలుగా భావిస్తున్న గుర్తులను నిశ్చితంగా పరిశీలించిన అటవీ శాఖ సిబ్బంది.. ఆ గుర్తులు నక్క జాతికి చెందిన పాద ముద్రలుగా నిర్ధారించారు. ప్రస్తుతం ఇటు వైపు చిరుత పులి వంటి జంతువుల సంచారం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఓలు శివరాజి రెడ్డి, చిన్నక్క, ఎఫ్‌బీఓలు లలిత, వాసుబాబు, హతీరాం, శ్రుతిలయ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో మరో నిందితుడి అరెస్ట్‌

రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ మారుజోడు రాంబాబు ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగల ముఠాలో మరో నిందితుడిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్‌ గురువారం తెలిపారు. గత నెల 18న అర్ధరాత్రి బస్టాండ్‌ సమీపంలోని రాంబాబు ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 15 వేల నగదు, రూ.40 వేల విలువైన టీవీ, రిస్ట్‌ వాచ్‌ ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడిన నిందితుల్లో ఈ నెల 3న విరగదిండ్ల పవన్‌కుమార్‌ను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపారు. గురువారం కోమళ్ల టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మరో నిందితు డు నల్లగొండ జిల్లా కేతేపేట మండలం కొత్తపేటకు చెందిన ఊర లింగయ్యను అరెస్ట్‌ చేశారు. అతడి నుంచి రూ. 25 వేల నగదు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపించామన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి వద్దనే.. జీవనధ్రువీకరణ పత్రం!

● తపాలా శాఖ ఆన్‌లైన్‌ సేవలు
● జీవన ప్రమాణ్‌ పత్రం జారీ
● బ్యాంకు, ఆధార్‌, పాస్‌పోర్ట్‌ సేవలు కూడా..
● విశ్రాంత ఉద్యోగులకు తపాలా శాఖ బాసట



వరంగల్‌ డివిజనల్‌ తపాలా శాఖ భవనం



విశ్రాంత ఉద్యోగి ఇంటి వద్ద ఆన్‌లైన్‌లో జీవన ధ్రువీకరణ పత్రం చేస్తున్న తపాలా సిబ్బంది

ఖిలా వరంగల్‌: విశ్రాంత ఉద్యోగులు తాము జీవించి ఉన్నామనే జీవన (ప్రమాణ్‌ పత్రం) ధ్రువీకరణ పత్రాన్ని ఏటా నవంబర్‌, డిసెంబర్‌లో ట్రెజరీ కార్యాలయానికి అందించాల్సి ఉంటుంది. దీనికి రోజుల కొద్దీ బ్యాంకుల చుట్టు తిరగాల్సి ఉంటుంది. ఇది వ్యవప్రాసలు కలిగే అంశం. ఈ నేపథ్యంలో ఈ విధానాన్ని సులువు తరం చేసేందుకు తపాలాశాఖ నడుంబిగించింది. బ్యాంకులో లభించే సేవలను పోస్టాఫీస్‌ల్లో కూడా అందజేస్తోంది. ఇందులో భాగంగా విశ్రాంత ఉద్యోగులకు వారి ఇంటి వద్దనే డిజిటల్‌ జీవన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తోంది. ఈ సేవలు అందించడానికి వరంగల్‌ జిల్లాలోని వరంగల్‌ డివిజన్‌ పరిధిలోని వరంగల్‌, మహబూబాబాద్‌ హెడ్‌పోస్టాఫీస్‌ల ద్వారా 42 పట్టణ, 364 గ్రామీణ తపాలాశాఖ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, బీడీ కార్మికులు, ఈపీఎఫ్‌ ద్వారా పింఛన్‌ పొందుతున్న వారందరికీ తపాలాశాఖ కొత్తగా డిజిటల్‌ లైఫ్‌ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ధ్రువీకరణ పత్రం పొందడమే కాకుండా ఆన్‌లైన్‌లో సంబంధిత కార్యాలయానికి క్షణాల్లో చేరుతోంది. దీంతో విశ్రాంత ఉద్యోగులు ట్రెజరీ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం కూడా ఉండదు. వరంగల్‌, మహబూబాబాద్‌ జిల్లాల వ్యాప్తంగా ఉన్న ట్రెజరీ కార్యాలయాల పరిధిలో సుమారు 40వేల మంది విశ్రాంతి ఉద్యోగులకు మేలు జరుగుతోంది.

డిజిటల్‌ సేవలు ఇలా..

విశ్రాంత ఉద్యోగుల ఇంటి వద్దే (జీవన ప్రమాణ్‌ పత్రం) డిజిటల్‌ లైఫ్‌ సర్టిఫికెట్లు అందించేందుకు వరంగల్‌ డివిజన్‌ వ్యాప్తంగా తపాలా శాఖ కార్యాచరణ చేపట్టింది. ఇందుకు గాను సమాచారం ఇస్తే బ్రాంచ్‌ పోస్టాఫీస్‌లు, తపాలా కార్యాలయాల్లో డివైజ్‌ ద్వారా తపాలా సిబ్బంది వారి ఇంటి వద్దకు వెళ్లి ఆధార్‌ బయోమెట్రిక్‌ ద్వారా విశ్రాంతి ఉద్యోగి వేలి ముద్ర తీసుకుని జీవన ధ్రువీకరణ పత్రాన్ని క్షణాల్లో ఆన్‌లైన్‌లో అందిస్తారు. వరంగల్‌ డివిజన్‌ తపాలాశాఖ 408 కార్యాలయాల ద్వారా ఈసేవలు అందిస్తోంది.

పత్రాలు కావాలంటే..

పింఛన్‌ ఐటీ, చెల్లింపు ఆర్డర్‌, పంపిణీ విభాగం, బ్యాంకు ఖాతా వివరాల నమోదుకు ఆన్‌లైన్‌లో రూ. 70 చెల్లించాల్సి ఉంటుంది. వేలిముద్ర ఆధారంగా డిజిటల్‌ లైఫ్‌ సర్టిఫికెట్‌ సంబంధిత కార్యాలయానికి చేరుతుంది. సంబంధిత విశ్రాంత ఉద్యోగి ఆన్‌లైన్‌ విజయవంతంగా సేవలు పూర్తయ్యాయనే సందేశం కూడా వస్తుందని వరంగల్‌ డివిజన్‌ సూపరింటెండెంట్‌ రవికుమార్‌ వివరించారు.

తపాలా సేవలపై అవగాహన కల్పిస్తున్నాం



తపాలాశాఖ ద్వారా మెరుగైన బ్యాంకు సేవలు అందిస్తున్నాం. డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీలు చెల్లిస్తున్నాం. రూ.200తో ఖాతా తెరిచి బీమా పాలసీల సౌకర్యాలు కల్పిస్తున్నాం. తక్కువ ప్రీమియంతో లభించే పాలసీలను ప్రజలకు అందుబాటులో ఉంచాం. ఇప్పటికే స్పీడ్‌ పోస్ట్‌, దేశ, విదేశాలకు పార్సిల్‌ సౌకర్యాలు, బ్యాంకు, బీమా, ఆధార్‌, పాస్‌పోర్ట్‌, జీవన ధ్రువీకరణ పత్రం జారీ చేసే ప్రక్రియ విజయవంతంగా చేపడుతున్నాం.

-రవికుమార్‌, సూపరింటెండెంట్‌
తపాలాశాఖ, వరంగల్‌ డివిజన్‌

మహాకుంభమేళా యాత్రకు ప్రత్యేక రైలు

● ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్‌ ప్రశాంత్‌



మాట్లాడుతున్న ప్రశాంత్‌

మహబూబాబాద్‌ రూరల్‌ : మహాకుంభమేళా పుణ్యక్షేత్ర యాత్రకు వెళ్లాలనుకునే భక్తుల కోసం ప్రత్యేక రైలు నడుపనున్నామని ఐఆర్‌సీటీసీ టూరిజం మానిటర్‌ ప్రశాంత్‌ అన్నారు. ఇండియన్‌ రైల్వే క్యాటరింగ్‌ అండ్‌ టూరిజం కార్పొరేషన్‌ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో మహబూబాబాద్‌ రైల్వే స్టేషన్‌ విశ్రాంతి గదిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన టూర్‌ ప్యాకేజీ వివరాలు వెల్లడించారు. ప్రయాణికుల రద్దీ లేకుండా 8 రాత్రులు, 7 పగళ్ల నిరంతరాయ ప్రయాణం కోసం మహాకుంభమేళా పుణ్యక్షేత్ర యాత్ర ప్రత్యేక రైలు నడుపనున్నట్లు తెలిపారు. ఈ రైలును భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రత్యేక రైలు జనవరి 19వ తేదీన సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్‌, మహబూబాబాద్‌, డోర్నకల్‌, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని రైల్వే స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. ఈ రైలులో వారణాసి, అయోధ్య, ప్రయాగ రాజ్‌ పుణ్యక్షేత్రాలు, ఆధ్యాత్మిక తదితర పర్యాటక ప్రాంతాలను తిలకించొచ్చని సూచించారు. ఈ రైలులో 576 బెర్తులు, ఎకనామి, స్టాండర్డ్‌, కంఫర్ట్‌, మూడు రకాలుగా ఉంటాయని టికెట్‌ ధర రూ.22,635 ఉంటుందన్నారు. సమావేశంలో ఐఆర్‌సీటీసీ టూరిజం ఎగ్జిక్యూటివ్‌ పవన్‌ సెగర్‌, టూరిజం సేల్స్‌, మార్కెటింగ్‌ డీఈఓ నరేశ్‌ బాబు పాల్గొన్నారు.

సైబర్‌ నేరగాళ్ల బరితెగింపు..

● బ్యాంకు ఉద్యోగి అకౌంట్ల నుంచి రూ.1.15 లక్షలు మాయం



బాధితుడు ప్రతాప్‌

పాలకుర్తి టౌన్‌ : సైబర్‌ నేరగాళ్లు బరితెగించారు. ఏకంగా ఓ బ్యాంకు ఉద్యోగి అకౌంట్ల నుంచి రూ.లక్షా 15 వేలు మాయం చేశారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం కేంద్రంలో జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం కొండాపురం శివారు మేకలతండాకు చెందిన లాకావత్‌ ప్రతాప్‌ పాలకుర్తిలోని పంజాబ్‌ నేషనల్‌ బ్యాంకులో విధులు నిర్వర్తిస్తున్నాడు. అదే బ్యాంకులో తనకు మూడు అకౌంట్లు ఉన్నాయి. వారం రోజుల క్రితం అదే బ్యాంకులో గోల్డ్‌లోన్‌ తీసుకోగా రూ.3 లక్షల 50 వేలు జమ అయ్యాయి. అయితే అక్కెర నిమిత్తం వారం క్రితం రూ. 2 లక్షల 50 వేలు తీసుకున్నాడు. మిగతా డబ్బులు తన అకౌంట్లలో ఉంచాడు. మంగళవారం రాత్రి తన మొబైల్‌లో బ్యాలెన్స్‌ చూసుకోగా డబ్బులు లేకపోవడంతో ఆందోళన చెందాడు. ఒక అకౌంట్‌లో రూ. వెయ్యి, మరో అకౌంట్‌లో రూ. 14వేలు, ఇంకొక అకౌంట్‌లో రూ. లక్ష మాయమయ్యాయి. తన డబ్బులు సైబర్‌ నేరగాళ్లు మాయం చేశారని నిర్ధారణకు వచ్చాడు. ఎలాంటి ఓటీపీ కూడా లేకుండా సైబర్‌ నేరగాళ్లు రూ.లక్షా 15 వేలు మాయం చేశారని లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం 1930 టోల్‌ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌ చేసి తన బ్యాంకు ఖాతాలను సీజ్‌ చేయించుకున్నాడు.

వేసవిలో వినియోగదారులకు ఇబ్బందులు కలగొద్దు

● ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్‌ సీఎండీ కర్నాటి వరుణ్‌ రెడ్డి

హన్మకొండ: వేసవిలో విద్యుత్‌ వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ సరఫరా చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌ రెడ్డి సూచించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్‌ కార్పొరేట్‌ కార్యాలయంలో ఎన్పీడీసీఎల్‌ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, ఆపరేషన్‌, టెక్నికల్‌, ఎమ్మార్టీ డీఈలు, ట్రాన్స్‌కో సీఈలు, ఎస్‌ఈలు, డీఈల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌పై చర్చించారు. వేసవి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సీఎండీ.. ఎస్‌ఈ, డీఈలను ఆదేశించారు. గత వేసవి విద్యుత్‌ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్లు సబ్‌ స్టేషన్‌లో పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, అలాగే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల పెంపు వంటి పనులు పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్‌ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావడానికి లూజ్‌ లైన్లు సరిచేయాలని, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల ఎత్తు పెంచాలని, ఎర్తింగ్‌ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్‌ డైరెక్టర్లు బి.అశోక్‌ కుమార్‌, టి.సదర్‌ లాల్‌, టి.మధుసూదన్‌, ట్రాన్స్‌కో సీఈ శ్రీరాం కుమార్‌, విజయ్‌ కుమార్‌, పాపారావు, డిస్కం సీఈలు కె.తిరుమల్‌ రావు, అశోక్‌, రాజు చౌహాన్‌, బీకంసింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



హోమంలో మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు

కాటారం: ప్రజలు సంతోషంగా, సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు. మంత్రి స్వగ్రామం కాటారం మండలం ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం మంత్రి శ్రీధర్‌బాబు.. తన సతీమణి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యార్‌, తల్లి జయమ్మతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, హోమం జరిపించారు. అంతకుముందు ఆలయ అర్చకులు మంత్రి శ్రీధర్‌బాబు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్‌ కాంగ్రెస్‌ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్‌, యూత్‌ అధ్యక్షుడు చీటూరి మహేశ్‌, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కోట రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌కు నృత్య తపస్వి అవార్డు

● నేడు ఏలూరులో ప్రదానం

హన్మకొండ కల్చరల్‌ : ఆంధ్రప్రదేశ్‌ 29వ వార్షికోత్సవ అంతర్జాతీయ నృత్య ఉత్సవంలో భాగంగా వరంగల్‌కు చెందిన ప్రముఖ పేరిణి నాట్య ఆచార్యుడు గజ్జెల రంజిత్‌కు అభినయ నృత్య భారతి ఏలూరు వారు భారత కళా ప్రపూర్ణ కోరాడ నరసింహారావు స్మారక నృత్య తపస్వి అవార్డు–2024ను ప్రకటించింది. ఈ మేరకు ఏలూరులోని శల నాగకోటేశ్వరావు కల్యాణ మంపడంలో హేలపురి లయన్స్‌ క్లబ్‌, సర్వీస్‌ ట్రస్ట్‌, లయన్స్‌ ఇంటర్నేషనల్‌, డిస్ట్రిక్ట్‌ 316జీ, కర్ణ భక్తుల సేవా సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జరగనున్న అంతర్జాతీయ నృత్యోత్సవంలో అతిథుల చేతుల మీదుగా గజ్జెల రంజిత్‌ ఈ అవార్డు అందుకోనున్నారు. 25 ఏళ్లుగా పేరిణి నాట్యాన్ని అందిస్తూ.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో రూపొందించిన మొదటి పేరిణి నృత్య రూపకం ప్రజాదారణ పొందిందని, ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని గజ్జెల రంజిత్‌ పేర్కొన్నారు.

వేతన వెతలు..


● ఐదునెలలుగా విడుదలకాని వేతనాలు
● తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఒకేషనల్‌ కాంట్రాక్టు అధ్యాపకులు



విద్యారణ్యపురి : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లోని ఒకేషనల్‌ కాంట్రాక్టు అధ్యాపకులకు ప్రభుత్వం ఐదునెలలుగా వేతనాలు విడుదల చేయడం లేదు. దీంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆయా అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్‌ ఉద్యోగులు, అధ్యాపకులకు ప్రభుత్వం ప్రతినెలా ఒకటవ తేదీనే వేతనాలు విడుదల చేస్తోంది.అయితే కాంట్రాక్టు అధ్యాపకులకు నెలలు గడిచినా వేతనాలు విడుదల చేయకపోవడంతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లోని కాంట్రాక్టు అధ్యాపకులకు రెగ్యులరైజ్‌ చేసినప్పటికీ ఒకేషనల్‌ కోర్సులు బోధించే రాష్ట్రంలో సుమారు 411మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్‌ చేయలేదు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో 50మందికిపైగా ఒకేషనల్‌ కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో ఐదునెలలుగా వేతనాలు విడుదల చేయకపోవడంతో అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారని ఒకేషనల్‌ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు పేర్కొంటున్నారు. వేతనాలు విడుదలచేసేలా సీఎం రేవంత్‌ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరుతున్నారు. ఒక్కో కాంట్రాక్టు అధ్యాపకుడికి నెలకు వేతనం రూ. 54వేల 220 చొప్పున చెల్లించాల్సింటుంది. తాము చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నా ఐదునెలలుగా జీతాలు విడుదల చేయకపోతే ఎలా అని కాంట్రాక్టు అధ్యాపకులు పేర్కొంటున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి 15 నెలల జైలు

● తీర్పు వెలువరించిన భూపాలపల్లి ఏజేఎఫ్‌ఎంసీ అడిషనల్‌ జిల్లా మెజిస్ట్రేట్‌



కాటారం: కాటారం మండల కేంద్రంలోని పలు ఇళ్లలో గత ఏడాది వరుస చోరీలకు పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 15 నెలల జైలు శిక్ష విధిస్తూ భూపాలపల్లి ఏజేఎఫ్‌ఎంసీ అడిషనల్‌ జిల్లా మెజిస్ట్రేట్‌ జి.అఖిల గురువారం తీర్పు వెలువరించారు. కాటారం ఎస్సై మ్యాక అభినవ్‌ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా నీల్వాయి మండలానికి చెందిన చింతకింది సతీశ్‌ 2023 అక్టోబర్‌ 22 నుంచి అక్టోబర్‌ 25వ తేదీల మధ్య మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌ కాలనీలో ముస్కుల సురేందర్‌రెడ్డి, రేపాల వేణుగోపాల్‌ ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై అభినవ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధారాలతో నిందితుడు సతీశ్‌ను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం చార్జిషీట్‌ దాఖలు చేసి గురువారం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ అర్జకుమార్‌ ఆధ్వర్యంలో కేసు విషయంలో ట్రయల్‌ జరిగిన అనంతరం సతీశ్‌ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించిన జడ్జి అఖిల.. నిందితుడికి 15 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

భార్య మృతి కేసులో భర్తకు ఐదేళ్లు..

ఖానాపురం: భార్య మృతి కేసులో భర్తకు కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రఘుపతి గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని కొత్తూరుకు చెందిన అమరావతి కృష్ణ మద్యం సేవించి అదనపు కట్నం తీసుకురావాలని భార్యను నిత్యం వేధింపులకు గురి చేసేవాడు. 2018లో ఆగస్టు 1న మద్య సేవించి వచ్చి భార్య రజితతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇద్దరం కలిసి చనిపోదామని ఇంట్లో ఉన్న కిరోసిన్‌ తీసుకొచ్చి తనతోపాటు భార్య శరీరంపై పోసి నిప్పంటించడంతో భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రజిత 2018 ఆగస్టు 5న మృతి చెందింది. ఈ ఘటనలో నేరం రుజువు కావడంతో జిల్లా కోర్టు న్యాయమూర్తి ప్రేమలతారెడ్డి.. కృష్ణకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

రెండు నాగళ్లతో సాలు



రైతులు సాధారణంగా ఒక్క నాగలితోనే పంట సాలు దున్నుతారు. అయితే.. యాసంగి మొక్కజొన్న పంట వేయడానికి వరంగల్‌ జిల్లా చెన్నారావుపేట మండలం సూర్యాపేట తండాకు చెందిన రైతు ధారావత్‌ బిచ్యా తన వ్యవసాయ భూమిలో రెండు దుక్కిడెద్దులు రెండు నాగళ్లు కట్టి ఒకేసారి రెండు సాళ్లు దున్నుతున్న దృశ్యం'సాక్షి' కెమెరాకు చిక్కింది. ఇలా చేయడం వల్ల సమయంతోపాటు శ్రమ తగ్గుతుందని రైతు పేర్కొన్నాడు.

- చెన్నారావుపేట

విద్యార్థి అదృశ్యం



యశ్వంత్‌

ఖిలా వరంగల్‌: వరంగల్‌ మిల్స్‌కాలనీ పీఎస్‌ పరిధి శివనగర్‌ ఏకశిల డీజీ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. శివనగర్‌కు చెందిన కుడ్ల శ్రీనివాస్‌ కుమారుడు యశ్వంత్‌ రోజువారీగా గురువారం ఉదయం ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లాడు. సబ్జెక్ట్‌ వారీగా పరీక్షలు రాశాడు. 3 గంటలకు ఎవరికీ చెప్పకుండా స్కూల్‌ నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి స్కూల్‌కు గాని ఇంటికి గాని చేరుకోలేదు. దీంతో విద్యార్థి యశ్వంత్‌ తండ్రి శ్రీనివాస్‌ మిల్స్‌కాలనీ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నారు.

ఊరుగొండలో యువతి..



దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన కన్నెబోయిన స్రవంతి బుధవారం కళాశాలకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో స్రవంతి తల్లిదండ్రులు బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల వెతకగా ఆచూకీ తెలియలేదు. స్రవంతి తండ్రి కన్నెబోయిన రాజేందర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చూసి దర్యాప్తు చేపట్టిన ఎస్సై కొంక అశోక్‌ గురువారం తెలిపారు. స్రవంతి 5 ఫీట్ల ఎత్తు, తెలుపు రంగులో ఉండి గుండ్రటి ముఖం కలిగి ఉంటుందని, ఆమె ఆచూకీ తెలిసిన వారు 8712685228, 8712685020 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఛీకేఎం..

కంపు కొడుతున్న సీకేఎం ఆస్పత్రి

● ఆవరణలో పారుతున్న డ్రెయినేజీ నీరు
● కమిషనర్‌ ఆదేశించినా మారని తీరు
● రోగాల పాలవుతున్న గర్భిణులు



ఆస్పత్రి ప్రాంగణంలో పారుతున్న డ్రెయినేజీ నీరు

ఎంజీఎం: వరంగల్‌ జిల్లాలో పేద గర్భిణులకు వరప్రదాయినిగా ఉన్న సీకేఎం ఆస్పత్రి పాలన అస్తవ్యస్తంగా మారింది. కొన్ని నెలలుగా ఆస్పత్రిలో శానిటేషన్‌ వ్యవస్థ పూర్తి అధ్వానంగా మారింది. పేద గర్భిణులు ప్రసవ సేవల కోసం సుదూర ప్రాంతాల నుంచి సైతం ఇక్కడికి వస్తుంటారు. కొన్ని నెలల నుంచి ఆస్పత్రిలో శానిటేషన్‌, సెక్యూరిటీ వ్యవస్థ నిర్వీర్యమవడంతో ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన వారికి.. కొత్తగా రోగాలు వచ్చే పరిస్థితి నెలకొందని గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంపు.. దోమల విజృంభణ

సీకేఎం ఆస్పత్రిలో వైద్యచికిత్సలందించే భవనం పురాతనమైంది కావడంతో ఆస్పత్రి అంతా కిక్కిరిసిపోయి కనిపిస్తూ ఉంటుంది. ఈ భవన ప్రాంగణాన్ని డ్రెయినేజీ పైప్‌ లైన్‌ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించకపోయినా, శానిటేషన్‌ను మెరుగుపరుచకపోయినా ఆస్పత్రి ప్రాంగణమంతా మురుగుతో కంపుకొడుతుంది. ఈమధ్య కాలంలో ఆస్పత్రిలో శానిటేషన్‌ వ్యవస్థ అధ్వానంగా మారడంతో డ్రెయినేజీ నీరు ఆస్పత్రిలో ప్రాంగణంలోకి చేరి కంపు కొడుతోంది. ఈవాసనతో కనీసం అక్కడ నిల్చోలేని పరిస్థితి ఏర్పడిందని గర్భిణులు, అటెండెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత అధికారుల నిర్ణయం.. రోగులకు శాపం

సీకేఎం ఆస్పత్రి హెచ్‌డీఎస్‌ విభాగంలో పని చేస్తున్న పారామెడికల్‌ సిబ్బందికి శానిటేషన్‌, సెక్యూరిటీ కార్మికుల స్థానంలో జీతాలు చెల్లించేలా గత కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేశారు. ఇదే ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్‌కు వరంగా మారింది. ఈనిర్ణయంతో శానిటేషన్‌, సెక్యూరిటీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. కార్మికుల స్థానంలో పారామెడికల్‌ సిబ్బంది విధులు నిర్వర్తించడం వల్ల సీకేఎం పరిపాలనాధికారులు కనీసం కాంట్రాక్టర్‌ను మందలించలేని దుస్థితి నెలకొంది. ఆస్పత్రిలో ఉండాల్సిన కార్మికుల స్థానంలో 15 నుంచి 20 మంది వరకు టెక్నికల్‌ సిబ్బందిని కొనసాగిస్తూ ఆస్పత్రి శానిటేషన్‌ వ్యవస్థను అధ్వానంగా మార్చేశారు. గత కొన్ని రోజుల క్రితం ఆరోగ్యశాఖ కమిషనర్‌ కర్ణన్‌ సందర్శించిన సమయంలో శానిటేషన్‌ అధ్వానంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేసి మెరుగుపర్చేలా చర్యలు చేపట్టాలని వరంగల్‌ డీఎంహెచ్‌ఓ సాంబశివరావును ఆదేశించారు. అయినప్పటికీ.. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆస్పత్రి నిర్వహణ పూర్తి అధ్వానంగా మారింది.

కలెక్టర్‌ దృష్టి సారించాలి..

ఆస్పత్రిలో అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. ముక్కు మూసుకుని సేవలు పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. గర్భిణులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉండి మురుగులో కాలు వేసినా జారిపడే ప్రమాదం ఉంది. సీకేఎం ఆస్పత్రిలో చికిత్సలు పొందే గర్భిణుల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్న క్రమంలో కలెక్టర్‌ ప్రత్యేక చొరవ తీసుకుంటే తప్ప ఆస్పత్రి సేవలు మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదని గర్భిణులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆస్పత్రి పాలనపై దృష్టి సారించాలని వారంతా వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● మరో ఇద్దరికి గాయాలు

వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని వీరాపురం గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని తుర్సవానిగూడెం గ్రామానికి చెందిన వంశీ(23), కోయబెస్తగూడెం గ్రామానికి చెందిన నవీన్‌, వీరాపురం గ్రామానికి చెందిన నల్లబోయిన శరత్‌ ద్విచక్ర వాహనంపై తర్సవానిగూడెం నుంచి మండల కేంద్రానికి వస్తున్నారు. ఈ క్రమంలో వీరాపురం గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం నవీన్‌, వంశీని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా వంశీ మార్గమధ్యలో మృతి చెందాడు.

కుంటలో పడి వ్యక్తి ..



వీరస్వామి (ఫైల్‌)

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన సాదు వీరస్వామి (55) బంగారు నర్సయ్య కుంటలో పడి మృతి చెందాడు. వీరస్వామి బుధవారం రాత్రి పత్తి చేను వద్ద కాపాల ఉన్నాడు. మాల విసర్జనకు వెళ్లి జారి కుంటలో పడ్డాడు. గురువారం పత్తి చేను వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులు.. వీరస్వామి కోసం గాలించగా కుంటలో పడి మృతి చెంది కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు.